సాక్షి చిత్తూరు

శనివారం, 30, ఆగస్టు, 2025



కాయల కాసులు కొట్టేశారా?

ఖరీఫ్ సబ్సిడీ వేరుశనగ కాయల సొమ్మును కొందరు స్వాహా చేసిన ఘటన జిల్లాలో సంచలనం రేకెత్తిస్తోంది. - 8లో



కుప్పం చేరుకున్న సీఎం చంద్రబాబు

హంద్రీ-నీవా కాలువలోని కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు కుప్పానికి విచ్చేశారు. - 8లో



ప్రయివేటు అంబులెన్స్ ఢీకొని..

ప్రయివేటు అంబులెన్స్ ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన తవణంపల్లె మండలంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



బోయకొండలో ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు

చౌడేపల్లె: బోయ కొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేశారు. రాహుకాల సమయం ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు సంప్రదాయ రీతిలో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో తరలివచ్చి మొక్కులు తీర్చారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సమావేశాల నిర్వహణకు అమలు చేయాల్సిన నియమనిబంధనలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేశారు. ఆ నిబంధనల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు పకడ్బందీ కసరత్తు చేపట్టారు. ఈ సమావేశాలకు జారీచేసిన షెడ్యూల్‌ను తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్లందరూ తప్పనిసరిగా సమావేశాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను అజెండా ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు.

ఉచిత అడ్మిషన్లు నిరాకరిస్తే చర్యలు



ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఆర్‌టీఈ 12–1(సీ)లో కల్పిస్తున్న ఒకటవ తరగతి ఉచిత అడ్మిషన్లను నిరాకరిస్తే చర్యలు తప్పవని సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మూడో విడతలో 137 మందికి అడ్మిషన్లు కల్పించారన్నారు. ఐదు కిలోమీటర్ల పరిధిలో ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతికి అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తమ సర్టిఫికెట్‌లతో ఈనెల 31వ తేదీలోపు కేటాయించిన పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాలన్నారు. తల్లిదండ్రుల నుంచి తమకు ఫిర్యాదులు అందితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఏపీసీ హెచ్చరించారు.

1న దరఖాస్తుల పరిశీలన

చౌడేపల్లె: బోయకొండ పాలక మండలి సభ్యుల దరఖాస్తులను సెప్టెంబర్ 1న పరిశీలించనున్నట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. మొత్తం 115 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వివరించారు. దరఖాస్తుదారులు అదేరోజు ఉదయం 10.30 గంటలకు విధిగా హాజరు కావాలని కోరారు.

లడ్డూ @ రూ.1.25 లక్షలు



తేజప్రకాష్‌రెడ్డిని సన్మానించి లడ్డూను అందజేస్తున్న వినాయక కమిటీ సభ్యులు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల పంచాయతీ, తిరుమణపల్లెలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసిన లడ్డూను గురువారం రాత్రి వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో గ్రామానికి చెందిన ఎం.తేజప్రకాష్‌రెడ్డి రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. గ్రామస్తులు రాజారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, భరత్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, నాగరాజరెడ్డి, కుమార్, చందు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 63,843 మంది స్వామివారిని దర్శించుకోగా 21,344 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వక్రతుండ.. మహాకాయ



ఉదయం వాహన సేవలో విహరిస్తున్న ఉత్సవర్లు


- మయూర వాహనంపై విహరించిన వినాయకుడు
- అశేష భక్తజనం నడుమ సాగిన ఊరేగింపు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నిత్య పూజలు, స్వామి నామస్మరణతో కాణిపాకం మార్మోగుతోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సిద్ధిబుద్ధి సమేత స్వామివారు స్వర్ణ మయూర వాహనంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉదయం స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు గావించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తదనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు మయూర వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు.



స్వర్ణ మయూర వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

నాడు శాశ్వతం



గత ఏడాది కుప్పంలో కృష్ణా జలాలకు పూజలు నిర్వహిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

- జల సంకల్పానికి ఊపిరులూది.. కుప్పం దాకా కృష్ణమ్మను పరుగులు పెట్టించిందెవరు?
- బీడువారిన పొలాలను సస్యశ్యామలం చేయాలని కంకణం కట్టుకున్నదెవరు?
- కరోనా రక్కసిని లెక్కచేయకుండా అందరికన్నా ముందుగా కుప్పం దాకా కృష్ణమ్మను తీసుకొచ్చిందెవరు?
- పిచ్చిమొక్కలతో నిండిన హంద్రీ-నీవా కాలువలో నీటి గళగళలు పెట్టించిందెవరు?
- నెర్రెలు బారి.. నోళ్లు తెరుచుకున్న చెరువులను నీటితో నింపిందెవరు?
- వానదేవుడిపై భారమేసి ఆకాశం వైపు ఆశగా ఎదురుచూసే అన్నదాతకు నేనున్నానని భరోసానిచ్చిందెవరు?
- కుప్పానికి నీరివ్వాలన్న దృఢ సంకల్పంతో అడుగులేసింది జగనన్న కాదా?.
- బక్కచిక్కిన రైతుకు అండగా నిలిచింది వైఎస్సార్‌సీపీ కాదా?

నేడు నాసిరకం

- సొంత కంపెనీలకు దోచిపెట్టి.. నాసిరకం పనులు చేసిందెవరు?
- లీకేజీలు, సీఫేజీలు పట్టించుకోకుండా గాలికొదిలేసిందెవరు?
- కొండలు..గుట్టల్లో సాగే హంద్రీ-నీవా కాలువ పనుల్లో నాణ్యత గురించి పరిశీలించిందెవరు?
- గతాన్ని మరిచి తన సొంత నియోజకవర్గానికి నీళ్లు తెచ్చామంటూ బడాయి మాటలు మాట్లాడేదెవరు?
- కృష్ణమ్మ నీటిపై అబద్ధపు శాసనం రాసి హంద్రీ-నీవాలో వదిలేస్తే దాన్ని శాశ్వత చిరునామాగా స్వీకరించేదెవరు?
- ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు అమాయకులనుకుంటున్నారా?
- గారడీ మాటలకు ఇంకా బోల్తాపడతారని నమ్ముతున్నారా?
- ఇంతెంత కాలం బాబూ.. ఈ నీటి మాటలు?



కొండలు, గుట్టల్లో తూతూమంత్రంగా జరిగిన లైనింగ్ పనులు

నిజం నీళ్లకేం తెలుసు?

నాసిరకంగా హంద్రీ-నీవా కాలువ పనులు

- రాళ్లున్న చోట సిమెంట్ పాలీష్
- రాళ్లపై నుంచి ఊడిపోతున్న సిమెంట్
- అండర్ పైప్‌లైన్ మార్గాల్లో తప్పని వాటర్ లీకేజీ
- చెరువులకు మళ్లించే చోట దెబ్బతిన్న సిమెంట్ పనులు



బైరెడ్డిపల్లి మండలం తీర్థం వద్ద నదిలోని రాళ్లపై నుంచి ఊడిన సిమెంట్ పెచ్చులు

పలమనేరు: కూటమి అబద్ధపు హామీలు.. గారడీ మాటలకు హంద్రీ–నీవా బలైపోతోంది. నాణ్యత లేని పనులు.. నాసిరక నిర్మాణాలతో తనలో ప్రవహించే కృష్ణమ్మను కాపాడలేక అల్లాడిపోతోంది. ఎక్కడ చూసినా లీకేజీలు.. ఏ పక్క చూసినా సీఫేజీలే కనిపిస్తుండడం సర్వసాధారణమైపోయింది. తమ సొంత కంపెనీలకు దోచిపెట్టి.. కుప్పానికి నీళ్లు తెప్పిస్తున్నామంటూ సంకలెగరేయడం విమర్శలకు తావిస్తోంది.

గత ప్రభుత్వంలో లైనింగ్ లేకనే!

కుప్పానికి కృష్ణమ్మను అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులేసింది. గంగవరం మండలంలోని పశపత్తూరు, వీకోట మండలంలోని కృష్ణాపురం, రామకుప్పం మండలంలోని ఆదినేపల్లి వద్ద పంప్‌హౌస్‌లు నిర్మించింది. పశపత్తూరు వద్ద 750 కిలోవాట్స్ సామర్థ్యం గల నాలుగు మోటార్ల ద్వారా గంటకు 5,400 క్యూసెక్‌ల నీటిని పంపే 5 వేల కేవీ మోటార్లను ఏర్పాటు చేసింది. దీంతో పాటు నీరు వేగంగా వెళ్లేలా భారీ కంప్రెషర్లు సమకూర్చింది. అప్పట్లోనే పెండింగ్ కాలువ నిర్మాణాలు, స్ట్రక్చర్ నిర్మాణాలు, 8 వేల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 40 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, మూడు చోట్ల లిఫ్ట్ పనులను పూర్తిచేసింది. కృష్ణా జలాలు కుప్పానికి చేరేలా చర్యలు చేపట్టింది.

రాళ్లున్న చోట నాసిరకం పనులు

కుప్పం ఉప కాలువకు సంబంధించి పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె నుంచి 143.9 కి.మీ పొడవుతో కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు దాకా పీబీసీ లైనింగ్ జరిగింది. ఇందులో బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం నుంచి రామనపల్లి కాలువ మార్గంలో రాళ్లున్న చోట సిమెంట్‌ను చల్లి వదిలేశారు. ఆ రాళ్లపై నుంచి సిమెంట్ కిందికి రాలుతోంది. ఇదే మార్గంలో కొన్నిచోట్ల ఓవర్ బ్రిడ్జీలపై నిర్మించిన పైప్‌లైన్లలో నీటి లీకేజీలు కనిపిస్తున్నాయి. తాతిరెడ్డిపల్లి వద్ద ఇంకా లైనింగ్ పనులు సాగుతున్నాయి. కాలువ మార్గంలో చెరువుకు నీరు మళ్లించే చోట్ల బయట వైపు నిర్మించిన సిమెంట్ పనులు దెబ్బతిన్నాయి. వీ.కోట మండలంలోని పోతనపల్లి వద్ద అటవీ మార్గంలో భూమిలోపల అమర్చిన పైప్‌లైన్లపై గాలి వెళ్లేందుకు వాల్వులు ఏర్పాటు చేశారు. ఇక్కడి అటవీ ప్రాంతంలో నీరు లీకవుతోంది. కాలువ లైనింగ్ పనులు అటవీ మార్గంలో ఎలా సాగుతాయో నేరుగా చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది.



పోతనపల్లి అడవిలోని కాలువలో అండర్‌పైప్ నుంచి లీకవుతున్న నీరు



తాతిరెడ్డిపల్లి వద్ద దెబ్బతిన్న సిమెంట్ పనులు

గొప్పలు.. కూటమికి తిప్పలు?

కూటమి ప్రభుత్వం గత టీడీపీ హయాంలో పనులు చేపట్టిన సీఎం రమేష్‌కు చెందిన కంపెనీకి అంచనాలను పెంచి లైనింగ్ పనులను కేటాయించింది. ఆ మేరకు కుప్పం బ్రాంచి కెనాల్ లైనింగ్ పనులు రూ.161.78 కోట్లు, పుంగనూరు ఉపకాలువ లైనింగ్ కోసం రూ.480 కోట్లను కేటాయించింది. ఈ పనులు దక్కించుకున్న సంస్థ నాసిరకంగానే పనులు చేపట్టింది. కనీసం క్వాలిటీ కంట్రోల్ శాఖ కూడా పట్టించుకోలేదు. దీంతో లైనింగ్ పనులు ఎన్నాళ్లుంటాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.



ఖాజీపేట వద్ద ఇప్పటికీ సాగుతున్న పనులు

కొంప ముంచిన కలుషిత ఆహారం

- వినాయక చవితి పూజల్లో ప్రసాదం, తాగునీరు తాగడంతో అతిసారం
- వాంతులు, విరేచనాలతో తల్లడిల్లిన 30 మంది బాధితులు
- జి.గొల్లపల్లెను సందర్శించిన అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ
- రోగులకు గ్రామంలోనే అత్యవసర వైద్య సేవలు



అతిసారం బాధితురాలి ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్న డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లెలో వినాయక చవితి పూజల్లో కలుషిత ప్రసాదాలు భుజించి, తాగునీరు సేవించడం వల్ల 30 అతిసారం బారినపడ్డారు. జి.గొల్లపల్లెలో గురువారం వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు చేసి గ్రామస్థులందరూ ప్రసాదాలు తిన్నారు. అక్కడే తాగునీరు సేవించారు. కానీ అదేరోజు రాత్రి ఐదుగురికి వాంతులు, విరేచనాలు కావడంతో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం గ్రామంలోని మరో 30 మందికి వాంతులు, విరేచనాలయ్యాయి. మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్ వేలు ఆధ్వర్యంలో జి.గొల్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని వంశీ, సరసమ్మ, జయమ్మ, నాగరాజు, సక్కూబాయి, శ్యామలమ్మ, గోవిందస్వామి, పుష్ప, సుబ్రమణ్యంను మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి, అరగొండ అపోలో హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. మిగిలిన వారి పరిస్థితి కుదుటపడడంతో ఇంటి దగ్గరే వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి బోరులో నీరు, వాటర్ ట్యాంకు లోనీరు, రోగుల ఇళ్లల్లో తాగునీరు టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపారు. ఐదు రోజుల పాటు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లెను జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డీఎస్‌ఓ డాక్టర్ అనిల్, ఎపిడిమిక్ అధికారి మోహన్‌శెట్టి శుక్రవారం సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి రోగులను పరామర్శించారు. 30 మంది అతిసారంతో బాధపడుతున్నట్లు సమాచారం అందడంతో వారు గ్రామానికి చేరుకుని రోగులకు ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వారం రోజులు పాటు గ్రామంలో వైద్యసేవలందించాలని సూచించారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, గోపి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పీహెచ్ కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : మెగా డీఎస్సీలో పీహెచ్ కేటగిరీలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను శనివారం పరిశీలించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీహెచ్ కేటగిరీలో అర్హత సాధించిన అభ్యర్థుల సదరం సర్టిఫికెట్లను మరోమారు పరిశీలన చేయనున్నారు. ఆయా అభ్యర్థులు నమోదు చేసిన వికలత్వాన్ని బట్టి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి నిర్ధారించనున్నారు. ఇందుకు గాను అంధులు, ఆర్థో, చెవిటి అభ్యర్థులకు శనివారం తిరుపతి రుయా ఆస్పత్రిలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వికలత్వం నిర్ధారించనున్నారు. కాగా ఈ పీహెచ్ కేటగిరీలో పలువురు అభ్యర్థులు బోగస్ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందినట్లు సమాచారం.

లక్కు..కిక్కు ఎవరికో?

చిత్తూరు అర్బన్: జిల్లాలో మద్యం బార్లకు అధికారులు దరఖాస్తులు ఆహ్వానించగా.. నాలుగు బార్లకు మాత్రమే అప్లికేషన్లు పడ్డాయి. శుక్రవారం మద్యం బార్లకు దరఖాస్తు చేసే ప్రక్రియ ముగిసింది. చిత్తూరులో అన్‌-రిజర్వుడు కింద 6, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి, చిత్తూరులో కల్లుగీత సామాజికవర్గానికి ఓ మద్యం బారుకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే గడువు ముగిసే సమయానికి చిత్తూరులో అన్‌-రిజర్వుడు కింద రెండు మద్యం బార్లకు, గీత సామాజికవర్గానికి ఒకటి, కుప్పం, పుంగనూరులో ఒక్కో బారుకు దరఖాస్తులు అందాయి. మొత్తం ఐదు బార్లకు 20 దరఖాస్తులు రావడంతో.. వీటిని శనివారం ఉదయం చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో డిప్ తీయనున్నారు. లక్కు ప్రాతిపదికన ఎవరిపేరు వస్తుందో, వాళ్లకు బార్ లైసెన్సును కేటాయించనున్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మూడేళ్ల పాటు మద్యం బార్ లైసెన్సును జారీ చేయనున్నారు. దరఖాస్తులు పడని ఆరు బార్లకు మరోమారు రీ–నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

కొందరికే యూరియా

- బయోమెట్రిక్ చేసుకున్నా దక్కని ఎరువు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పలమనేరు మండలం, బయ్యప్పగారిపల్లి రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు

పలమనేరు: ప్రస్తుతం యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో కుప్పానికి సీఎం చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో యూరియా విషయంపై రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందనే నిఘా వర్గాల హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఆ మేరకు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా కావాల్సిన వారి వివరాలను నమోదు చేసుకొని, వారి బయోమెట్రిక్ సేకరించి టోకెన్లు అందించే కార్యక్రమాన్ని గత సోమవారం నుంచి చేపట్టింది. ఆయా గ్రామాల రైతులు ఆర్‌ఎస్‌కేల వద్ద బయోమెట్రిక్ చేసుకొని టోకెన్లు పొందారు. ఎట్టకేలకు శుక్రవారం పలు ఆర్‌ఎస్‌కేల్లో యూరియా పంపిణీ మొదలైంది. ఉదయం నుంచే రైతులు భారులు తీరారు. తీరా ఒక్కో ఆర్‌ఎస్‌కేకు సగటున 150 బస్తాల యూరియా మాత్రమే కేటాయించారు. రైతులు మాత్రం 400 దాకా వచ్చారు. వీరికి యూరియా దక్కకపోగా అక్కడున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మరికొందరు ఏమీ చేయలేక వెనుదిరిగారు.

అధికార పార్టీ అండదండలుంటేనే..

ముందుగా టోకెన్లు పొందిన వారికి కాకుండా అధికార పార్టీ అండదండలున్న వారికి మాత్రం ముందుగానే యూరియాని అక్కడి సిబ్బంది అందించారని రైతులు ఆరోపిస్తున్నారు. టోకెన్లు పొంది కూడా లాభం లేకుండా పోయిందని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఏవో సంధ్యారాణిని వివరణ కోరగా మండలంలోని సముద్రపల్లి, మండిపేటకోటూరు, మొరం ఆర్‌ఎస్‌కేల్లో ఒక్కోచోట 150 బస్తాల యూరియాను పంపిణీ చేశామన్నారు. మళ్లీ వస్తే మిగిలిన రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

కుప్పం చేరుకున్న చంద్రబాబు

శాంతిపురం: కుప్పం పర్యటన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సాయంత్రం విచ్చేశారు. కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువులో హంద్రీ–నీవా నీటికి జలహారతి, పూజలు నిర్వహించేందుకు ఆయన వచ్చారు. బెంగళూరు నుంచి హెలీకాప్టర్‌లో తుమ్మిశి వద్ద ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీలోని శివపురం వద్ద ఉన్న తన స్వగృహానికి చేరుకున్నారు. రాత్రి కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించిన చంద్రబాబు వారికి దిశానిర్దేశం చేశారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా కుప్పానికి నీళ్లు తెచ్చిన నేపథ్యంలో ప్రజలందరూ సంబరాల్లో పాల్గొనే చూడాలని చెప్పారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఎంపి దగ్గుమల్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం ఉన్నారు.

నైజీరియా నుంచి విరూపాక్షపురానికి..



బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలంలోని విరూపాక్షపురం పక్షవాతం వ్యాధి నయం కావడానికి అందించే ప్రకృతి వైద్యం పేరు పొందడంతో విషయం తెలుసుకున్న నైజీరియా దేశస్తులు శుక్రవారం విరూపాక్షపురం గ్రామం చేరుకున్నారు. స్థానిక వైద్యుల వద్ద పక్షవాతం నయం కావడానికి మందు తీసుకున్నారు. ప్రస్తుతం నైజీరియా దేశస్తులతో స్థానికులు తీసుకున్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కాయల కాసులు కొట్టేశారా?

- ఖరీఫ్‌లో జిల్లాకు 30,228 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు
- విత్తనాల విలువ రూ.28.16 కోట్లు
- రాయితీ పోను అసలు మొత్తం రూ.16.69 కోట్లు
- ప్రస్తుతం రూ.50 లక్షలవరకు బకాయిలు
- నెలలు గడుస్తున్నా తిరిగి చెల్లించని వ్యవసాయశాఖ
- కూటమి నేతల చేతుల్లో ఇరుక్కుపోయిందంటున్న సిబ్బంది
- పట్టించుకోని జిల్లా అధికారులు



చిత్తూరు రూరల్(కాణిపాకం): వేరుశనగ విత్తన కాయల సొమ్మును వాడేసుకున్నారు. రూ.28.16కోట్ల విలువ చేసే కాయలు సొమ్ములో కొంతమేర దారిమళ్లించారు. కాయలు విక్రయించిన రైతు భరోసా సిబ్బంది ఇష్టానుసారంగా వాడేశారు. నెలలు గడుస్తున్నా నగదు చెల్లింపులో జాప్యం చేస్తున్నారు. ప్రస్తుతం రూ.50 లక్షల వరకు చెల్లింపులు పేరుకుపోయాయి. కొంత సొమ్ము కూటమి నేతల చేతుల్లో ఇరుక్కుపోయిందని సిబ్బంది మదనపడుతున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

లక్షల్లో చెల్లించాలి

జిల్లాకు సరఫరా చేసిన విత్తన రాయితీ ధర రూ.11.27కోట్లు పోను రూ.16.69కోట్లు రైతు భరోసా కేంద్ర సిబ్బంది ఏపీ సీడ్స్‌కు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఈ ఏడాది జూన్ 2 నుంచి 20వ తేదీ వరకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. కాయలు పంపిణీ చేసిన వెంటనే రైతుల దగ్గర నుంచి కూడా నిర్ణీత ధరను వసూలు చేశారు. అయితే వసూళ్లు చేసిన విత్తన నగదును ఎప్పటికప్పుడు ఏపీసీడ్స్ ఖాతాకు జమచేయాలి. కానీ పలువురు సిబ్బంది ఆ నగదును జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నట్టు తెలుస్తోంది. 15 రోజుల క్రితం వరకు రూ.1.50 కోట్ల వరకు చెల్లించాలని తెలిసింది. వారం క్రితం రూ.70 లక్షలు ఉన్నట్లు అధికారులు లెక్కలుగట్టారు. ఇప్పుడు రూ.50లక్షల వరకు చెల్లించాల్సి ఉందని అంటున్నారు.

ఇచ్చేశారు..ఇరుక్కుపోయారు

కాయలు ఇచ్చే బాధ్యతల్లో కూటమి నేతలు సైతం పాలు పంచుకున్నారు. వారి కనుసన్నల్లోనే విత్తన కాయలను పంచారు. దగ్గరుండి కాయల పంపిణీని పూర్తిచేశారు. చివరకు కొంతమంది నేతలు అప్పు పేరుతో కాయలు దండుకున్నారు. చాలా మంది నగదు చెల్లించలేదని సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇక కొంతమంది సిబ్బంది ఇష్టానుసారంగా విత్తన కాయల నగదును వాడేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీడీనెల్లూరు, వీకోట, పలమనేరు, పుంగనూరు, కుప్పం, చిత్తూరు తదితర మండలాల్లో ఈ బకాయిలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో పలు మండలాల వ్యవసాయశాఖ అధికారులకు కూడా సంబంధాలున్నాయి. సర్దుబాటుతో ఈ నగదును సిబ్బంది చేతి నుంచి మండల వ్యవసాయశాఖ అధికారులు వాడేసుకున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు షోకాజ్ నోటీసులిచ్చి నెట్టుకొస్తున్నారు. కూటమినేతలు అప్పు తీసుకోవడంతో కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులకు వరకు నోరు మెదపని పరిస్థితి ఉంది. కానీ అధికారులు కూటమి కాయల కథను దాచి పెడుతున్నారు. బదిలీల సమయంలో నో డ్యూస్, నో చార్జ్ పత్రాలు ఇస్తేనే బదిలీలకు అవకాశం కల్పించారు. అలాంటప్పుడు ఈ బకాయిలు ఎలా ఉండిపోయాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ ఖరీఫ్ లెక్క

ఖరీఫ్ దృష్ట్యా జిల్లాకు ఈ సారి 30,283 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు సరఫరా అయ్యాయి. వీటి ధర రూ.28.16 కోట్లు. ప్రభుత్వం రాయితీతో ఈ విత్తనాలను జిల్లాకు అందించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ బాధ్యతలను రైతు భరోసా కేంద్ర పరిధిలో పనిచేసే వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బందికి అప్పగించారు. వారు ఆ కాయలను రైతులకు విక్రయించి సొమ్మును ఏపీసీడ్స్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ చెల్లింపులో కొందరు సిబ్బంది మాయ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అప్పు తీసుకున్నారు



చాలా చోట్ల కాయలను అప్పు తీసుకున్నారు. బదిలీల వల్ల కొన్ని చెల్లింపుల్లో ఆలస్యమైంది. ఎవరైతే చెల్లించలేదో వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చాం. రికవరీ చేస్తున్నాం. పూర్తి స్థాయిలో చేయిస్తాం. చెల్లించని వారిపై కచ్చితంగా చర్యలు ఉంటాయి. – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖఅధికారి, చిత్తూరు

ప్రయివేటు అంబులెన్స్ ఢీకొని మహిళ మృతి



ప్రమీల (ఫైల్)

ఐరాల: ప్రైవేటు అంబులెన్స్ బీభత్సం సృష్టించింది. తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారిలో రోడ్డు పక్కన కూలి పనులు చేస్తున్న మహిళపై దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, అంబులెన్స్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో మహిళ స్వల్పంగా గాయపడింది. కాణిపాకం ఎస్ఐ నరసింహులు కథనం.. ఐరాల మండలం, చిగరపల్లెకు చెందిన ప్రమీల(40) తిరువణంపల్లె సమీపంలోని జాతీయ రహదారిపై కూలి పనులు చేయడానికి వెళ్లింది. రోడ్డు పక్కన ఐషర్ వాహనం నుంచి సూచిక బోర్డులను దింపుతుండగా వేగంగా దూసుకొచ్చిన ప్రయివేటు అంబులెన్స్ ప్రమీలను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అదే గ్రామానికి చెందిన ఇంద్రాణికి స్వల్ప గాయాలయ్యాయి. అంబులెన్స్ డ్రైవర్ మాధవ్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతురాలికి భర్త విజయ్‌కుమార్ (తాపీ మేస్త్రీ), ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అది సరికాదు

చిత్తూరు కలెక్టరేట్ : మెగా డీఎస్సీ అభ్యర్థులకు మే 15వ తేదీ కటాఫ్‌తో డీఎస్సీ అర్హత నిర్ణయించడం సరికాదని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీ అభ్యర్థులకు వింత నిర్ణయాలు అమలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చే ముందే ప్రతి జిల్లాలో సబ్జెక్టుల వారీగా రోస్టర్ కమ్ మెరిట్‌లో అభ్యర్థులు సాధించిన మార్కులు, రిజర్వేషన్ కేటగిరీ తెలిసే తుది ఎంపిక జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన పరిశీలన



అపోలో యూనివర్సిటీలో నిరీక్షిస్తున్న, వెరిఫికేషన్ కు విచ్చేసిన అభ్యర్థులు, కుటుంబీకులు



అపోలో యూనివర్సిటీలో సర్టిఫికెట్‌ల పరిశీలన..

చిత్తూరు కలెక్టరేట్ : మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహించిన ఈ కసరత్తు రెండు రోజుల పాటు సాగింది. చిత్తూరు జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఉన్న అపోలో యూనివర్సిటీ, ఆర్‌వీఎస్ నగర్‌లో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. ఈ ప్రక్రియలో 1,478 మందికి గాను 1,394 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. మిగిలిన 84 మంది అభ్యర్థులు టీజీటీ, పీజీటీ కేడర్లు కావడంతో వైఎస్సార్ కడపలో పరిశీలన చేస్తారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అపోలో యూనివర్సిటీలో చిత్తూరు డీఈవో వరలక్ష్మి, ఎస్వీ సెట్‌లో కేవీఎన్ కుమార్ పర్యవేక్షణలో సర్టిఫికెట్ల పరిశీలన కసరత్తు సాగింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టిన అభ్యర్థులపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా వారి వివరాలను సైతం నివేదికల్లో నమోదు చేసుకున్నారు. ఈ ప్రక్రియలో ఫేక్ సర్టిఫికెట్‌లు, గైర్హాజరు అయిన అభ్యర్థుల స్థానంలో మరో జాబితాను రూపొందించి సెప్టెంబర్ 1వ తేదీన ప్రచురిస్తారని తెలిసింది. ఇదిలావుండగా పీహెచ్ (దివ్యాంగులు) కేటగిరీలో దాదాపు 50 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. ఈ కేటగిరీలో కొంతమంది అభ్యర్థులు తప్పుడు సర్టిఫికెట్‌లు నమోదు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

ఒత్తిడితో విలవిల!



- తిరుపతి నగరంలో పేరొందిన ఓ ప్రైవేటు పాఠశాలలో వెంకటగిరికి చెందిన ఓ విద్యార్థినిని తల్లిందండ్రులు ఈ ఏడాది జూన్‌లో 3వ తరగతిలో చేర్పించారు. ఆ పాఠశాలలోనే హాస్టల్‌లో చేర్పించి ఫీజులు లక్షల్లో చెల్లించుకున్నారు. ఆగస్టు 10వ తేదీన ఆ విద్యార్థి సరిగా స్పందించలేదని, ఆహారం సైతం సరిగా తీసుకోవడం లేదని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం సమాచారం ఇచ్చింది. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు పాఠశాల వసతి గృహానికి చేరుకొని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మానసికంగా ఒత్తిడికి గురైందని కనీసం మూడేళ్ల పాటు తగిన వైద్యం అందించాలని తెలియజేశారు.

- ఓ ప్రముఖ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి తలనొప్పితో బాధపడుతోందని చంద్రగిరి గ్రామీణ ప్రాంతానికి చెందిన తల్లిదండ్రుల తమ వద్దకు తీసుకొచ్చినట్లు నగరంలో ఓ ప్రైవేటు వైద్యశాల డాక్టర్ తెలియజేశారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు ఒత్తిడితో మానసికంగా ఇబ్బంది పడుతోందని వైద్యులు తేల్చేశారు. దీంతో ఏకైక కుమారుడైన తమ బిడ్డకు ఇలాంటి పరిస్థితి రావడం దారుణమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంచుకుని వైద్యం అందిస్తున్నారు.

తిరుపతి సిటీ : జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. ఎంతో మంది విద్యార్థులు యాజమాన్యాల ఒత్తిడిని తట్టుకోలేక మానసిక రోగులవుతున్న విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు సంస్థలు దాచడం సంచలనం సృష్టిస్తోంది. తల్లిదండ్రులు సైతం ఇందులో బాధ్యులు కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రధానంగా 5 ఏళ్ల వయస్సు పిల్లల నుంచి 15 ఏళ్లలోపు వారు మానసిక రోగులుగా మారుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగులుగా ఉండటం, పిల్లలు సెల్‌ఫోన్‌కు అడిక్ట్ అవడంతో ఒకటో తరగతి పిల్లలను సైతం ప్రైవేటు పాఠశాలలో చేర్పించి అక్కడే హాస్టల్స్‌లో ఉంచడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

మాయమాటలు చెప్పి..

జిల్లాలో సుమారు 689 ప్రైవేటు కళాశాలలు ఉండగా అందులో సుమారు 356 ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. తల్లిదండ్రులకు ఆశలు రేపి మీ పిల్లలను స్టేట్ ర్యాంకర్లుగా తీర్చిదిద్దుతామని మాయమాటలు చెప్పి కోట్లలో వ్యాపారం చేసుకుంటూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఎంతో మంది ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తల్లిదండ్రుల ఆప్యాయతకు దూరమవుతున్నారు. దీంతో శారీరక రుగ్మతలకు గురవడంతో పాటు మానసిక ఒత్తిడికి గురై మానసిక రోగులుగా మారుతూ తల్లిదండ్రులకు గుండె కోతను మిగులుస్తున్నారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



“ప్రైవేటు యాజమాన్యాల ఊకదంపుడు ప్రచారాలకు ఆకర్షితులై ప్రైవేటు విద్యా సంస్థల్లో పిల్లలను చేర్పించడం దారుణం. దీంతో తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోక.. ప్రైవేటు యాజమాన్యాల టార్చర్ భరించలేక మానసిక రోగులవుతున్నారు. ఇది భావి భారతానికి ప్రమాదకరం. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ఆలోచించాలి.

– సుబ్బిరామిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, తిరుపతి

మానసికంగా కుంగిపోతున్నారు



పసికందుల జీవితాలతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ఆడుకుంటున్నాయి. ఇది చాలా ప్రమాదకరం, పాఠశాల యాజమాన్యాలు వ్యాపారంలో భాగంగా పిల్లల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి వారిని స్కూల్‌తో పాటు వారు నిర్వహిస్తున్న వసతిగృహాల్లో చేర్పించుకుని నరకం చూపిస్తున్నారు. దీంతో రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్న విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

– రవిశంకర్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం



లీలావతి అలియాస్ నాగవేణి (ఫైల్)

చౌడేపల్లె: పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని పెద్దయల్లకుంట్లకు చెందిన లీలావతి అలియాస్ నాగవేణి(48) భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె పుట్టినిల్లు అయిన పెద్దయల్లకుంట్లలోనే నివాసముంటున్నారు. పెద్ద కుమారుడు సుబ్రమణ్యం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు హ రీష్ ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె ఎప్పుడూ తనకు తానే నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ వేళ్లేదని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం గ్రామానికి సమీపంలోని పొలం వద్దకు వెళ్లి శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది చంద్రశేఖర్, హరిప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నాగవేణిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

చోరీ కేసులో ముగ్గురికి జైలు

చిత్తూరు అర్బన్: ఓ ఇంట్లో చోరీ చేసిన కేసులో హేమచంద్ర (28), సురేష్ (27), వరప్రసాద్ (20) అనే ముగ్గురు నిందితులకు ఆర్నెళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధిస్తూ చిత్తూరులోని మూడో అదనపు జూనియర్ సివిల్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. ఈ ఏడాది జనవరి 8వ తేదీన చిత్తూరు మండలం, చెర్లోపల్లెకు చెందిన తేజ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి 30 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి తాలూక పోలీసులు కాణిపాకంకు చెందిన హేమచంద్ర, ప్రకాశం జిల్లాకు చెందిన సురేష్, సత్యసాయి జిల్లాకు చెందిన వరప్రసాద్ అనే ముగ్గురు చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో వారికి ఆర్నెళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శిరీష తీర్పునిచ్చారు.

నారాయణ కళాశాల భవన నిర్మాణ పనుల్లో కార్మికుడి మృతి

రేణిగుంట : మండలంలోని విప్పమానుపట్టెడ గ్రామ సమీపంలోని తుడా లేఅవుట్‌లో నారాయణ విద్యాసంస్థలకు చెందిన నూతన భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు అన్సర్ హేహమన్ (19)నాలుగో అంతస్తు నుంచి జారి కింద పడి శుక్రవారం మృతి చెందాడు. గాజుల మండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ జాప్యాన్ని నివారించాలి



డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పీఎఫ్ రుణాల తుది మొత్తాల చెల్లింపులో నెలకొన్న తీవ్ర జాప్యాన్ని నివారించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ మాట్లాడారు. తమ జీతాల నుంచి ప్రతినెలా పొదుపు చేసుకున్న మొత్తాల నుంచి రుణాలు పొందాలంటే కష్టంగా మారిందన్నారు. పదవీ విరమణ చెందినవారికి తుది మొత్తాలు చెల్లించాల్సి ఉండగా నెలల తరబడి వేచిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిస్సింగ్ క్రెడిట్స్‌కు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో జీతాల డ్రాయింగ్ అధికారులను పూర్తి స్థాయిలో భాగస్వాములను చేయాలని కోరారు. పీఎఫ్ మిస్సింగ్ క్రెడిట్స్‌కు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని హామీనిచ్చారు. అనంతరం డిప్యూటీ సీఈఓకు వినతి పత్రం అందజేశారు. నాయకులు దేవరాజులురెడ్డి, చంద్రన్, శేఖర్, వాసు, బాలచంద్రారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, గుణశేఖర్, ఢిల్లీ బాబు, భరత్, వెంకటేష్ పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు ఆర్‌కే విద్యార్థిని ఎంపిక



జాతీయ అవార్డుకు ఎంపికైన ఉదయశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్ బద్రినారాయణ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని మిట్టూరులో ఉన్న రుక్మిణి కృష్ణస్వామి విద్యాలయ జూనియర్ కళాశాల విద్యార్థిని ఉదయశ్రీ డా.అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం ఆ కళాశాలలో సదరు విద్యార్థికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆ కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించిన విద్యార్థిని ఉదయశ్రీ డా.అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. భారత ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఈ అవార్డును జాతీయ స్థాయిలో అందజేస్తుందన్నారు. షెడ్యూల్ కులానికి చెందిన విద్యార్థిని ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించి జాతీయ అవార్డుకు ఎంపికైందన్నారు. విద్యార్థినికి సెప్టెంబర్ 2న దేశ రాజధాని డిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిభా అవార్డుతో పాటు రూ.60 వేల నగదు బహుమతి అందుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థినిని అభినందించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.